క్లుప్తంగా

నేడు అమ్మవారికి ప్రత్యేక పూజలు

సైదాపురం: మండలంలోని దేవరవేమూరు గ్రామంలో ఆదివారం గ్రామదేవత అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వారంతా కలిసి అమ్మ వారికి పొంగళ్లు పెట్టి తమ మొక్కులను తీర్చుకో నున్నారు.

డీవీ సత్రంలో రేబిస్ డే



డీవీ సత్రంలో రేబిస్ వ్యాధిపై ర్యాలీ

దొరవారిసత్రం: దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చైతన్య ఆధ్వ ర్యంలో శనివారం ప్రపంచ రేబిస్ డే దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రేబిస్ వ్యాధి కుక్క కాటుతోనే కాకుండా ఇతర జంతువుల కాటు వేసిన కూడా రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వైద్యాధికారి తెలియజేశారు. స్థానిక పీహెచ్‌సీలో రేబిస్ వ్యాధికి చెందిన వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓం సంపూర్ణమ్మ, ఎల్‌టీ మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి

కలువాయి: కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీల నిర్వహణ పరిశీలించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై ఆరా తీశారు. ఆరోగ్య సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై వైద్యాధికారి డాక్టర్ రామకుమారితో చర్చించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ బాలకొండయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ

కలువాయి: కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పిరమిడ్ ధ్యాన మందిరం నిర్వాహకులు రాణి, భారతి శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ఆశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ జైకిషోర్, శివకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో అనర్థాలు అనేకం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోట: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఉదయకుమార్‌రాజు, హరిక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట ఆర్డీవోగా కిరణ్మయి



కిరణ్మయి

సూళ్లూరుపేట: రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఈతమాకుల కిరణ్మయి యాదవ్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆమె స్థానిక శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కార్యాలయంలో పదవీ బాధ్యతలను చేపట్టారు. సూళ్లూరుపేట ఆర్డీవోగా పనిచేసిన ఆర్.చంద్రముని బదిలీ కావడంతో ఎన్‌టీఆర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా వున్న కిరణ్మయి యాదవ్‌ను సూళ్లూరుపేటకు బదిలీ చేశారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహశీల్దార్లు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

హాకీ క్రీడా సామగ్రి పంపిణీ

గూడూరు రూరల్: విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం దాతల సహకారంతో విద్యార్థులకు హాకీ క్రీడా సామగ్రిని అందించారు. గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి బట్టేపాటి మురళీక్రిష్ణ పాఠశాలలోని విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే క్రమంలో హాకీ క్రీడా సామగ్రిని అందించారు. హెచ్‌ఎం డీవీఎస్ మల్లికార్జున్, పీడీ కరిముల్లా, ఉపాధ్యాయులు జోసఫ్, వేణు, దయాకర్, పుల్లంరాజు, ప్రవీణ్‌గురు, రాజశేఖర్, బాలమురళీ, సీనియర్ క్రీడాకారులు నిఖిల్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గూడూరు రూరల్: చెన్నూరు బీసీ కాలనీలో వారం రోజుల క్రితం జరిగిన హత్య కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. చెన్నూరు బీసీ కాలనీకి చెందిన ఆనందమ్మ అనే మహిళను హత్య చేసిన పాలెపు రమేష్‌ను తిప్పవరప్పాడు క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ కిశోర్‌బాబు తెలిపారు. ఆయన వెంట రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఉన్నారు.

బాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు



పూజల అనంతరం మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



చిల్లకూరు: గూడూరు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ



శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నాయకులతో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- తిరుమల లడ్డూలో కల్తీ అంటూ నిందలు సమంజసం కాదు
- వరదరాజస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): మాయలమారి చంద్రబాబునాయుడుకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు ఆసన్నమయ్యాయని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని కాంపాళెం సమీపంలో ఉన్న వరదరాజస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ వెలుపల మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలన 100 రోజులు పూర్తిచేసుకున్న రాష్ట్ర ప్రజలకు ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. అంతేగాకుండా ఎంతో పవిత్రమైన శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదంలో నెయ్యి కల్తీ అయిందంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు మోపడం సమంజసం కాదన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు పయనమైన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని డిక్లరేషన్ ఆంక్షలతో అడ్డుకునేందుకు ప్రయత్నించారన్నారు. రేణిగుంట విమానాశ్రయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అడ్డుకునే రాజకీయ కుట్రకు తెరలేపారన్నారు. ముఖ్యమంత్రి అయిన తరువాత బ్రహ్మోత్సవాల్లో అనేక పర్యాయాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించి తమ భక్తి చాటుకున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కులం, మతం లేదని, ఆయనకు ఉన్న మతం మానవత్వమని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టేటి హరికృష్ణ, సేతరాసి బాలయ్య, పి.లక్ష్మి, పులి ప్రసాద్‌రెడ్డి, కందాటి కళ్యాణి, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, సుబ్బారావు, వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, పూజారి శ్రీనివాసులు, కందాటి రాజారెడ్డి, యజ్దానిబాషా, కల్లు సతీష్, దశరథరామిరెడ్డి, నారాయణరెడ్డి, పేజీరాజ్, తలపల మల్లికార్జున్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బుద్ధి మారాలి

రాపూరు: తిరుమలలో కల్తీ నెయ్యితో లడ్డూ తయారు చేశారంటూ చంద్రబాబు నోటికి వచ్చినట్లు ఆరోపించడం తగదని ఆయన బుద్ధి మారాలంటూ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పూజలు నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో రాపూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధలయ్య దేవాలయంలో ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. నాయకులు శివయ్య, మురళీమోహన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, శివకుమార్‌రెడ్డి, డీవీ రమణయ్య, రత్నాకర్‌రెడ్డి డమ్మాయి రమణయ్య, కలపాటి మధుసూదన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, గోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీహరిరెడ్డి, లోకేష్, పెంచలయ్య, ఉమామహేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రమేష్, సంజీవరెడ్డి, వరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు

ఓజిలి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన లడ్డు ప్రసాదాలపై చంద్రబాబునాయుడు చేసిన అసత్య ప్రచారాలకు ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు ఆలయాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్రబల్లవోలు గ్రామంలో సర్పంచ్ యల్లా సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముమ్మడి రామయ్య మహాలక్ష్మమ్మ ఆలయంలో పూజలు చేశారు. గుర్రంకొండ గ్రామంలో సర్పంచ్ ముప్పాళ్ల మాధవీలత వినాయక ఆలయంలో, కుందాంలో సర్పంచ్ ఎద్దల కనకదుర్గారమణి, రాజారామిరెడ్డి రాజరాజేశ్వరమ్మ ఆలయంలో పూజలు చేశారు. నాయకులు దశరథరామిరెడ్డి, కల్లూరు మధురెడ్డి, రవి, ముప్పాళ్ల మోహన్‌రాజు, వామనరాజు పాల్గొన్నారు.

ప్రజలు ఎదురు తిరుగుతారనే లడ్డూ వివాదం

చిల్లకూరు: మంచి పాలన అని ప్రజల వద్దకు వెళితే ఎదురు తిరుగుతారనే భయంతో సీఎం చంద్రబాబు లడ్డూ వివాదం మొదలు పెట్టారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు పట్టణంలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల ఆలయం ప్రతిష్టను ఒక్క సారిగా దిగజార్చే ప్రయత్నం చేయడంతోపాటుగా దానిని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని నిలదీస్తారని ప్రజల చూపును మరల్చేందుకు కొత్త ఎత్తుగడ వేశారని అన్నారు. విచారణ పేరుతో తనకు అనుకూలమైన పోలీసులతో సిట్ నియమించడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వస్తారంటే కొత్తగా డిక్లరేషన్ ఇవ్వాలనడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇకనైనా చంద్రబాబు అండ్‌టీంకు మంచి బుద్ధిని దేవుడు ప్రసాదించాలని ఆయన కోరారు. బొమ్మిడి శ్రీనివాసులు, యద్దల మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, భక్తవత్సలరెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, చిట్టమూరు జెడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కొండూరు సునీల్‌రెడ్డి, ఎంపీపీ బూదూరు గురవయ్య, కొట్టు గోవర్ధన్, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి బుద్ధినివ్వు...

తడ: రాజకీయాల కోసం ఎంత దిగజారుడు పనికైనా సిద్ధపడే చంద్రబాబునాయుడు చివరి రోజుల్లో అయినా మంచి బుద్ధితో మసలుకునేలా మార్చాలి వెంకన్నా అంటూ తడ మండల వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ముక్త కంఠంతో వెంకటేశ్వర స్వామికి విన్నవించారు. శ్రీకాళహస్తి రోడ్డులో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి దేవదేవుడికి తమ విన్నపాలు వినిపించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఆర్ముగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నాగరాజారెడ్డి, ఆర్‌కే సుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, కె.నందారెడ్డి, ఎం.రమేష్‌రెడ్డి, తిరుమలైరెడ్డి, మునీష్‌రెడ్డి, చిన్నప్పన్, సుధాకర్, సర్దార్, దొరైరెడ్డి పాల్గొన్నారు.

ఊరూరా ఆలయాల్లో పూజలు

పెళ్లకూరు: తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డూ కల్తీ అంటూ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలకు వ్యతిరేకంగా శనివారం చిల్లకూరు, చెంబేడు, నెలబల్లి, రోసనూరు, తాళ్వాయిపాడు, అక్కగారిపేట, పునబాక గ్రామాల్లో పలు ఆలయాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. హిందువుల ఆత్మాభిమానం దెబ్బతినేలా అసత్య ఆరోపణలు చేసిన చంద్రబాబును దేవుడు కచ్చితంగా శిక్షిస్తాడని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, చిల్లకూరు సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, ధర్మయ్య, నాయకులు కృష్ణయ్య, రమణారెడ్డి, పోలయ్య, ప్రశాంత్, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కల్తీపై దుష్ప్రచారం తగదు

- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్: మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై చంద్రబాబు లేని పోని ఆరోపణలతో దుష్ప్రచారం చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. తిమ్మాజీకండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న శ్రీఅభయ అనుగ్రహ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలను నిర్వహించారు. ముందుగా సంజీవయ్యతోపాటు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఒట్టూరు రాధ, వీపీ కుమార్ రెడ్డి, బెనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య తదితర నాయకులు శ్రీవెంకటేశ్వర స్వామి పాదల చెంత ఉన్న మెట్ల మార్గంలో కర్పూరం వెలిగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఆలయం వెలుపల సంజీవయ్య నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం తిరుమలకు స్వామివారి దర్శనానికి వస్తుంటే అడ్డుకునేలా నిస్సిగ్గుగా వ్యవహరించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర పూర్తి చేసినప్పుడు కూడ నేరుగా ఇంటికి వెళ్లకుండా తిరుమలకు చేరుకుని కాలి నడకన వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారని తెలిపారు. అప్పుడు కూడా అధికారంలో టీడీపీ ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా డిక్లరేషన్ అడగడం భావ్యం కాదన్నారు. చంద్రబాబు అలవిగాని హామీలను అమలు చేయలేక, విజయవాడలో వరదలకు ప్రభుత్వమే కారణం తదితర వైఫల్యాలను ప్రజల నుంచి దృష్టి మరల్చేందుకే లడ్డూ వివాదం సృష్టించారన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని లడ్డూ కల్తీ కళంకంపై చంద్రబాబు క్షమాపణలు చెప్పాలన్నారు. నాయకులు ఒట్టూరు కిషోర్ యాదవ్, కట్టా భవాని శంకర రెడ్డి, గంధవల్లి సిద్ధయ్య, పాదర్తి హరనాథ్‌రెడ్డి, బాబు రెడ్డి, వైస్ ఎంపీపీలు అత్తికాయల కృష్ణవేణి, నెలవల మమత, ధారా రవి, తేజ్‌దీప్, ప్రకాశం, ప్రభాకర్ వాకాటి సుధాకర్‌రెడ్డి, అత్తికాయల శ్రీనివాసులు, గోపాలయ్య, షేక్ రహమతూల్లా, షబ్బీర్, రమణయ్య, మెస్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాపూరు సిద్ధలయ్య ఆలయం వద్ద...



కర్రబల్లవోలులో...



తడలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నెలబల్లి ఆలయంలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి పూజలు

వేడుకగా శ్రీవారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 4 అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛారణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 ఊంజల్ సేవ నిర్వహించారు. కల్యాణం, ఊంజల్‌సేవ తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ టి.లక్ష్మి

చిల్లకూరు: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ అధికారి టి.లక్ష్మి సూచించారు. మండల కేంద్రమైన చిల్లకూరులోని సాయి విద్యానికేతన్ జూనియర్ కళాశాలలో శనివారం గూడూరులోని సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మహిళలు కూడా రసాయనాలతో పండించే కూరగాయలు, ఇతర పదార్థాల కారణంగా క్యాన్సర్‌కు గురవుతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు కనుగొనేందుకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపల్ వి.అరుణకుమార్, సిస్టర్ పద్మజ, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణం వేగవంతం

సైదాపురం: పక్కా గృహాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ సూచించారు. షామైన్, దాడిశెట్టిపల్లి గ్రామాల్లో గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. వెలుగు పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.30 వేలు రుణాలను ఇవ్వడంతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పని దినాలను కల్పిస్తామన్నారు.

దారి విషయంలో ఒకరిపై దాడి

చిల్లకూరు: బూదనం గ్రామంలో శనివారం దారి విషయంలో ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదంలో ఏడుగురు ఒకరిపై దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బూదనం గ్రామంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న దారి వివాదాన్ని పరిష్కరించుకునేందుకు పంచాయతీ అధికారులతో వెళ్లిన మైలాం శ్రీనివాసులురెడ్డిపై మరో వర్గానికి చెందినవారు దాడికి పాల్పడ్డారు. వీరయ్య, వెంకటక్రిష్ణయ్య, భాస్కర్, విష్ణు, భారతి, హేమంత్, లక్ష్మమ్మలు దాడి చేసి గాయపరిచారని తెలిపారు. గాయపడ్డ శ్రీనివాసులురెడ్డి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండగా దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులు పరిశీలన

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని తిమ్మాజీకండ్రిగ గ్రామంలో వందల ఏళ్లనాటి చరిత్ర కలిగిన వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను శనివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరిశీలించారు. జీర్ణోద్ధరణ కోసం గత ప్రభుత్వంలో దేవదాయ శాఖ నుంచి రూ.60 లక్షలు, టీటీడీ నుంచి రూ.25 లక్షల నిధులను అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న సంజీవయ్య మంజూరు చేయించారు. పనులను గ్రామ సర్పంచ్ నల్లారి ప్రకాశం, తేజ్‌దీప్, పాలేటి నాగార్జున, ప్రభాకర్‌లతో కలిసి పరిశీలించారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

గూడూరు రూరల్: చిన్న తనం నుంచే ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ పెట్టాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్య విభాగం వైద్యుడు శ్రీనివాసరావు సూచించారు. రూరల్ పరిధిలోని పోటుపాళెం పంచాయతీలోని సబ్ సెంటర్‌ను శనివారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో బృంద సభ్యులు మాట్లాడారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, ఎస్‌ఓ నాగేంద్ర, సూపర్‌వైజర్ నరేష్, , ఉమా, టెక్నీషియన్ ప్రకాష్, ఏఎన్‌ఎంఎస్‌లు కవిత, సౌజన్య, శశికళ, ధూమణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



పరంధామయ్యను సన్మానిస్తున్న శ్రీనివాసులు, నాగేంద్రకుమార్

రాపూరు: మండలంలోని గోనుపల్లి ప్రాథమిక పాఠశాల్లో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పనిచేస్తున్న పరంధామయ్య ఉపాధ్యాయుల దినోత్సవంనాడు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. దీంతో శనివారం పాఠశాలలో ఆయన్ను ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎం నాగేంద్రకుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరంధామయ్య విద్యార్థులకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌస్‌మొహిద్దీన్, వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, సుధాకర్, అనీల్, భాగ్యలక్ష్మి, దేవి, కవిత, నాగేశ్వరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్యులు

నాయుడుపేట టౌన్: తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం శనివారం రాత్రి పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నాయుడుపేట పట్టణానికి చెందిన గూడూరు కిషోర్‌కుమార్ జిల్లా రూరల్ అధ్యక్షుడిగా, గాదంశెట్టి నాగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా పత్తిపాటి తులసికృష్ణ, రాష్ట్ర, జిల్లా మహిళ మండలి సభ్యులు, గౌరవ అధ్యక్షుడిగా పారిశ్రామికవేత్త పెసల జయ రాజగోపాల్, జక్కా సుబ్బారావులోపాటు ఇతర మండలాల నూతన కార్యవర్గం చేత ఆ సంఘ రాష్ట్ర నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్యవైశ్యసంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షుడు చిన్నిరామ సత్యనారాయణ, నెల్లూరు జిల్లా రూరల్ అధ్యక్షుడు కమర్లపూడి సుబ్రమణి, ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోండి



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

వెంకటగిరి రూరల్: పోలేరమ్మ తల్లి జాతరలో పట్టణానికి చెందిన చెంచుకుమార్‌పై విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ వామపక్షలు, దళితసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద వామపక్ష పార్టీలు, దళిత సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, మురళీ, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీపీ రమణయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, గురవమ్మ, పల్లిపాటి రవి, వడ్డిపల్లి చెంగయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

చిల్లకూరు: గుర్రం జాషువా జయంతి వేడుకలను శనివారం పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భారతీయ శిక్షణా మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు ప్రజేంద్రరెడ్డి మాట్లాడుతూ గుర్రం జాషువా తెలుగులో ఎన్నో రచనలు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

నాయుడుపేట టౌన్: పక్కా గృహ నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో టిడ్కో గృహ సముదాయం సమీపంలో శనివారం గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులతో అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. హౌసింగ్ ఈఈ ఎంవీ మోహన్ రావు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఎస్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికే గ్రామసభలు



స్వర్ణాంధ్ర 2047 వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఓజిలి: గ్రామ పంచాయతీలలో మౌలిక వసతులు కల్పించి సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎద్దల కనకదుర్గారమణి అన్నారు. మండలంలోని కుందాం పంచాయతీలో స్వర్ణాంధ్ర–2047, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలపై పంచాయితీ కార్యదర్శి పెద్దమస్తానయ్య గ్రామసభను శనివారం నిర్వహించారు. కుందాం సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ఎద్దల రాజారామిరెడ్డి, నాయకులు ఎద్దల శేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.